క్లుప్తంగా

అలరించిన భక్తిగాన లహరి



పాత గుంటూరు: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై సోమవారం జమిలి వెంకట వరద రాజులు, కోటిరత్నావతి సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇమ్మడి అంజనీదేవి బృందం భక్తిమాల గీతాలాపన ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. తొలుత ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్. మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంగీత విద్వాంసులు ఇమ్మడి అంజనీదేవి, కోట లక్ష్మీదేవి, డాక్టర్ కుసుమ, యశోద, యోగేశ్వరి, భారతి, విశ్వపావని, రమామహేశ్వరి, బ్రహ్మేశ్వరి తమ గాత్రధారణలో పలు వాగ్గేయకార కీర్తనల్ని శ్రావ్యంగా ఆలపించారు. కీబోర్డుపై శాయి, తబలాపై బాలాజీ వాయిద్య సహకారం అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా 'అవగాహన' వ్యవస్థాపక దినోత్సవం



లక్ష్మీపురం: బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలోని పద్మావతి కల్యాణ వేదికపై సోమవారం అవగాహన సంస్థ 33వ వ్యవస్థాపక దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ నగర ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయడంలో అవగాహన సంస్థ కృషి ఆదర్శనీయమని తెలిపారు. విద్యావేత్త ఆర్.రాము మాట్లాడుతూ అవగాహన లాంటి సంస్థలు నేటి పరిస్థితుల్లో చాలా అవసరమని చెప్పారు. ప్రముఖ వైద్యులు టి.సేవాకుమార్ మాట్లాడుతూ అవగాహన సంస్థ కార్యదర్శి శివరామిరెడ్డికి అంతా చేయూతనందించాలని కోరారు. అనంతరం కొండా శివరామిరెడ్డిని మాణిక్య వరప్రసాద్, డాక్టర్ శేషయ్యతో పాటు సంస్థ సభ్యులు సత్కరించారు.

పరీక్ష సామగ్రి పంపిణీ



గుంటూరు రూరల్: అడవితక్కెళ్లపాడు లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలోని పదో తరగతి విద్యార్థులకు సత్తెనపల్లికి చెందిన హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సెల్లో పెన్ కంపెనీ ఎగ్జిక్యూటివ్ యూకే రాజు, అతని స్నేహితులు సోమవారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కేఎల్ యూనివర్సిటీ అసోసియేట్ డీన్ డాక్టర్ కె.రూతురమ్మ ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సమయం, సంపదను ఉపయోగించుకోవాలని, అప్పుడే అభివృద్ధి, విజయం ఉంటుందని తెలిపారు. ఆర్ఆర్బీ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ టి.ఇమ్మానియేలు, హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, విద్య, ప్రిన్సిపల్ కొండారెడ్డి, శ్రీలక్ష్మి, విజయభాస్కర్, ప్రేమ్‌కుమార్, నాగభూషణం విశ్వేశ్వరరావు విద్యార్థులు పాల్గొన్నారు.

సేవా సారథులు వలంటీర్లు

వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను ఇంటింటికి చేరవ చేయడంలో వలంటీర్ల పాత్ర ఎంతో కీలకమని వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని మామిళ్ళపల్లి గ్రామంలో వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించాలని సూచించారు. నిరంతరం ప్రజలకు సేవ చేసే భాగ్యాన్ని ప్రభుత్వం వలంటీర్లకు అందించిందని తెలిపారు. వలంటీర్ వ్యవస్థ శాశ్వతంగా ఉండాలని ప్రజలంతా ఆకాంక్షిస్తున్నారని, అంతటి అభిమానాన్ని చూడగొన్న వారు అభినందనీయులని కొనియాడారు.

నేడు పొన్నూరులో ఉచిత వైద్య శిబిరం

బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఇటుకంపాడు రోడ్డు బుర్రయ్య సత్రంలో మంగళవారం జగన్నామ సంక్షేమ సంగమం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సీఈవో, వైఎస్ఆర్ సీపీ పొన్నూరు నియోజకవర్గం సమన్వయకర్త అంబటి మురళీ కృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో గుండె పదిలం, నేత్ర జ్యోతి, దివ్యాంగ దర్శిని, ఫిజియోథెరపీ సంబంధిత వైద్య సేవలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజలు శిబిరాన్ని సందర్శించి, ఆరోగ్య పరీక్షలు చేయించుకొని వైద్య సేవలు పొందాలని సూచించారు.

ఓటర్ల అర్జీలు, ఫిర్యాదులకు మూడు రోజుల్లో పరిష్కారం

అధికారుల సమావేశంలో కమిషనర్ కీర్తి చేకూరి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: ఓటర్ల నుంచి అందే అర్జీలు, ఫిర్యాదుల్ని మూడు రోజుల్లోగా పరిష్కరించాలని, లేనిపక్షంలో బీఎల్‌ఓతో పాటు సూపర్వైజరీ అధికారులపై కూడా చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్‌ఓ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో సోమవారం ఓటర్ల నుంచి అందే క్లైముల పరిష్కారం, విధుల కేటాయింపుపై సూపర్వైజరి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల విధులు సమర్థంగా నిర్వహించేలా నగరపాలక సంస్థ సూపరింటెండెంట్లను తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశామని తెలిపారు. విధులు కేటాయించబడిన సూపరింటెండెంట్లు తమ పరిధిలో సెక్టోరల్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. బీఎల్‌ఓలు తప్పనిసరిగా ఈఆర్‌ఓ అనుమతితోనే సెలవులు తీసుకోవాలన్నారు. ఎన్నికల విధులు అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులను పూర్తి చేసి, ఎన్నికల నిర్వహణకు చేపట్టాల్సిన పనులపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. సమావేశంలో ఏఈఆర్‌ఓలు సీహెచ్.శ్రీనివాస్, వెంకటలక్ష్మి, నిరంజన్, ఎస్.ఈ సుందరరామిరెడ్డి, మేనేజర్ శివన్నారాయణ అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల మార్పులను గమనించాలి

గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో కొన్ని పోలింగ్ కేంద్రాల చిరునామా, పేరు మార్పులను రాజకీయ పార్టీల నాయకులు గమనించాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్‌ఓ కీర్తి చేకూరి తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి ఆమోదం అనంతరం మార్పు వివరాలను ప్రకటిస్తామని చెప్పారు. సోమవారం కమిషనర్ చాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో పోలింగ్ కేంద్రాల చిరునామా, పేరు మార్పులపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గంలో ఎనిమిది పోలింగ్ కేంద్రాల్ని మార్చడంతో పాటు మరో ఏడు కేంద్రాల పేర్లు మార్చినట్లు తెలిపారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు 15 వందల ఓట్లకన్నా ఎక్కువ ఉన్న ఐదు కేంద్రాలకు అదనపు కేంద్రాల్ని (ఆక్జలరి పోలింగ్ స్టేషన్లు) ఏర్పాటు చేశామని తెలిపారు. పశ్చిమ నియోజకవర్గంలో రెండు కేంద్రాల మార్పుతో పాటు 11 కేంద్రాల పేర్లు మార్చినట్లు చెప్పారు. 15 వందల కన్నా అధికంగా ఓట్లు ఉన్న తొమ్మిది కేంద్రాలకు అదనపు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మార్పులకి సంబంధించి జిల్లా ఎన్నికల అధికారి ఆమోదం అయిన తర్వాత ఫైనల్ పోలింగ్ కేంద్రాల లిస్టు రూపొందిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్, పశ్చిమ ఈఆర్‌ఓ కె.రాజ్యలక్ష్మి, సూపరింటెండెంట్లు సాంబశివరావు, పద్మ, వైఎస్సార్ సీపీ నుంచి డి.జానీబాబు, బీఎస్పీ నుంచి సీహెచ్.వాసు, బీజేపీ నుంచి పాండురంగ విఠల్, ఆమ్ ఆద్మీ నుంచి సేవకుమార్, కాంగ్రెస్ నుంచి జానీ బాషా పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం

స్పందనలో ప్రజల నుంచి అందే ఫిర్యాదుల పరిష్కారానికి అధికారులు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ హాలులో సోమవారం స్పందన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి కమిషనర్ అర్జీలు స్వీకరించారు. ఫిర్యాదుల్ని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. సోమవారం నిర్వహించిన స్పందనలో 47 ఫిర్యాదులు అందాయని కమిషనర్ తెలిపారు.ఇందులో పట్టణ ప్రణాళిక విభాగానికి- 8, ఇంజినీరింగ్ విభాగానికి- 14, రెవెన్యూ విభాగానికి- 7, ప్రజారోగ్య విభాగానికి- 4, అకౌంట్స్ విభాగానికి -1, ఉపా సెల్ విభాగానికి 13 ఫిర్యాదులు అందాయని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్లు సీహెచ్.శ్రీనివాస్, డి.వెంకటలక్ష్మి, ఎస్ఈ సుందరరామిరెడ్డి, డెప్యూటీ సిటీప్లానర్ శ్రీనివాసరావు, మేనేజర్ శివన్నారాయణ, డీసీపీలు, ఏసీపీలు, ఈఈలు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

ముస్లింలకు అన్ని వేళలా వైఎస్సార్ సీపీ అండ

విప్ లేళ్ల అప్పిరెడ్డి



కరీముల్లాను సత్కరిస్తున్న లేళ్ల అప్పిరెడ్డి

నగరంపాలెం: ముస్లింలకు వైఎస్సార్ సీపీ అన్నివేళలా అండగా ఉంటుందని శాసనమండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి అన్నారు. గత నెల 21న ఏపీ మైనారిటీ విభాగ కమిటీ రాష్ట్ర కార్యదర్శిగా షేక్ కరీముల్లా నియమితులైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ కార్యాలయంలో కరీముల్లాను శాలువాతో విప్ లేళ్ల అప్పిరెడ్డి సత్కరించారు. నూతనంగా నియమితులైన షేక్ కరీముల్లా మాట్లాడుతూ సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింలకు ఆరు ఎమ్మెల్యే అభ్యర్థుల సీట్లను ప్రకటించారని తెలిపారు. ముస్లింలంతా ఆయన పక్షాన ఉన్నారని పేర్కొన్నారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో మరలా సీఎంను చేసేందుకు ముందుకురావాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు 99 ఎమ్మెల్యేల సీట్లను ప్రకటించగా, అందులో ఒక సీటు మాత్రమే కేటాయించారని మండిపడ్డారు. ముస్లింల ద్రోహి చంద్రబాబు అని, రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బాజి, సిలార్ పాల్గొన్నారు.

ప్రణాళికతో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



మాట్లాడుతున్న మేనేజర్ రఘురామ్

గుంటూరు ఎడ్యుకేషన్: మేనేజ్‌మెంట్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు ప్రణాళికతో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని జోసిల్ సంస్థ డెప్యూటీ జనరల్ మేనేజర్ కె.రఘురామ్ పేర్కొన్నారు. అమరావతిరోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో సోమవారం ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థుల్లో ఎంట్రప్రెన్యూరియల్ స్కిల్స్‌ను వెలికితీసేందుకు సృజన పేరుతో రెండు రోజుల పాటు నిర్వహించనున్న పోటీల ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న రఘురామ్ మాట్లాడుతూ విద్యార్థులు ఉద్యోగాలను అడిగే స్థాయి నుంచి వాటిని కల్పించే స్థాయికి చేరుకోవాలని, ఇందుకు కళాశాలలోనే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ మాట్లాడుతూ సృజన దిఈడీ ఛాలెంజీ పోటీల్లో భాగంగా ఒక సంస్థను నడిపేందుకు అవసరమైన మార్కెటింగ్, మానవ వనరులు, ఆర్థిక విభాగం వంటి రంగాల్లో విద్యార్థులను బృందాలుగా విభజించనున్నట్లు చెప్పారు. ఒక్కో బృందంలో ఒక టీం లీడర్ నలుగురు సభ్యులుగా ఏర్పాటు చేసి మంగళ, బుధవారాల్లో పోటీలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమలలో సృజన కన్వీనర్ డి. కల్యాణి, కో-కన్వీనర్ చల్లా వైష్ణవి, కళాశాల పాలకమండలి ఉపాధ్యక్షుడు ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ, ఎంబీఏ విభాగాధిపతి వి. చక్రవర్తి, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె. లలిత, సహాయాచార్యులు ఏ.బాజీబాబు, సీహెచ్ వేదవతి, వి. అఖిలాష్, డాక్టర్ ఎస్. గోపి శ్రీనివాసరావు, ఎన్. మణింత, బి. అనిత, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో 2కే వాక్



మారథాన్‌లో పాల్గొన్న బీజేపీ నేతలు

గుంటూరు మెడికల్: నారీ శక్తి వందన్ మారథాన్ పేరిట రన్ ఫర్ నేషన్ - రన్ ఫర్ మోదీ 2కె వాక్ కార్యక్రమాన్ని సోమవారం బీజేపీ మహిళామోర్చా జిల్లా అధ్యక్షురాలు నడ్డి నాగమల్లేశ్వరి యాదవ్ ఆధ్వర్యంలో గుంటూరులో నిర్వహించారు. స్థానిక బృందావన్ గార్డెన్స్ ఎన్టీఆర్ స్టేడియం నుంచి ప్రారంభమై లక్ష్మీపురం మీదుగా లాడ్జి సెంటర్ అంబేడ్కర్ విగ్రహం వరకు 2కే వాక్ జరిగింది. ఈ సందర్భంగా మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు నడ్డి నాగమల్లేశ్వరి యాదవ్, రాష్ట్ర ఇన్‌చార్జి భూపతిరాజు శ్రీనివాసరావు మాట్లాడుతూ నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అయిన నాటి నుంచి అన్ని రంగాల్లోనూ మహిళలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. ముస్లిం మహిళలకు ట్రిబుల్ తలాక్ చట్టాన్ని ఎత్తివేసి మహిళల్లో ఆత్మ విశ్వాసాన్ని నింపారని, మహిళలకు 33 శాతం రిజర్వేషన్ తీసుకొచ్చిన ఘనత కూడా మోదీకే దక్కుతోందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్, రాష్ట్ర హెడ్ క్వార్టర్ ఇన్‌చార్జ్ మకుటం శివ, నారీ శక్తి వందన్ కార్యక్రమ ఇంచార్జి విజయశ్రీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు యడ్లపాటి స్వరూపరాణి, మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి శ్రీకళ్యాణి, ఉపాధ్యక్షులు నాగమల్లీశ్వరి, మహాలక్ష్మి, స్రవంతి, మౌనిక, జిల్లా కార్యదర్శులు కత్తి మేరీ సరోజిని, ఏలూరి లక్ష్మి, దుర్గాభవాని, సుకన్య, పాలపాటి రవికుమార్, చరక కుమార్ గౌడ్, చెరుకూరి తిరుపతిరావు, ఆవుల నాగేంద్ర, పద్మనాభం, దారా అంబేడ్కర్, దర్శనపు శ్రీనివాస్, యశ్వంత్, నాగ మోహన్, వెంకటేష్, దర్శి నర్సింహారావు, కృష్ణ చైతన్య, సురేష్ పాల్గొన్నారు.

మండలానికొక మోడల్ పోలింగ్ స్టేషన్

- నియోజకవర్గంలో మరో మూడు పోలింగ్ స్టేషన్ల పెంపు
- ఆర్డీవో పి. శ్రీకర్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో పి. శ్రీకర్

ప్రత్తిపాడు: నియోజకవర్గంలో మండలానికొక మోడల్ పోలింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేయనున్నాయని ఆర్డీవో పి. శ్రీకర్ తెలిపారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని గుంటూరు రూరల్ మండలంలో 3, 5, 62 పోలింగ్ కేంద్రాల్లో 1500లకు పైగా ఓట్లు ఉండటంతో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓట్లను విభజించి అదనంగా 3-ఏ, 5-ఏ, 62-ఏ నంబర్లతో మరో మూడు పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీంతో నియోజకవర్గంలో పోలింగ్ బూత్‌ల సంఖ్య 288కు చేరనుందని ఆర్డీవో వివరించారు. అదేవిధంగా మరో పదిహేను పోలింగ్ కేంద్రాలకు పేర్లు మార్చడం జరిగిందని చెప్పారు. ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, వట్టిచెరుకూరు, గుంటూరు రూరల్ మండలాల్లో మండలానికొకటి చొప్పున ఐదు మోడల్ పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. అంతేకాకుండా నియోజకవర్గంలో మహిళా ఓటర్లు అధికంగా ఉన్న ప్రాంతంలో మహిళా మోడల్ పోలింగ్ స్టేషనును కూడా ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. రాజకీయ పార్టీల నాయకులు మరొక్కసారి ఓటర్ల జాబితాను నిశితంగా పరిశీలన చేసుకుని, అభ్యంతరాలుంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆర్డీవో కోరారు. నూతన ఓటుకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. 85 సంవత్సరాలు పైబడిన వారు ఇంటి వద్ద నుంచే తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిందని, అలాంటి వారు ఎవరైనా ఉంటే దరఖాస్తు చేసుకోవచ్చని శ్రీకర్ చెప్పారు. ఈ సమావేశంలో ఆయా మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

మిర్చి రైతుకు గిట్టుబాటు ధర లభించేలా చూడాలి

ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాద్



సమావేశంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాద్, యార్డు చైర్మన్ రాజనారాయణ, నేతలు

కొరిటెపాడు(గుంటూరు): ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు సోమవారం గుంటూరు మిర్చి యార్డును సందర్శించారు. యార్డులో నిర్వహిస్తున్న ఉచిత రైతు భోజన శాల, రైతు విశ్రాంతి భవన్‌ను సందర్శించి రైతుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన భోజనం అందిస్తున్నారా.. విశ్రాంతి భవన్‌లో వసతులు ఎలా ఉన్నాయి.. ప్రస్తుతం మిర్చి ధరలు ఎలా ఉన్నాయి.. గిట్టుబాటు అవుతుందా.. కొనుగోలు చేసిన మిర్చికి ఎన్ని రోజుల్లో డబ్బులు చెల్లిస్తున్నారు.. తదితర వివరాలు రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మిర్చి యార్డు చైర్మన్‌తో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ గుంటూరు మిర్చి యార్డు ఆసియా ఖండంలోనే అతి పెద్ద మార్కెట్ యార్డు అని, నిత్యం వేలాది మంది రైతులు ఏపీ నుంచే కాకుండా తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల నుంచి యార్డుకు తమ సరుకు విక్రయించుకోవడానికి వస్తున్నారని తెలిపారు. యార్డుకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన భోజనంతో పాటు వసతి సౌకర్యం కల్పించాలని సూచించారు. రైతులు తెచ్చే మిర్చి ఖాళీ గోతానికి రూ.25 లు చెల్లిస్తున్నారని, కనీసం ఒక్కో గోతానికి రూ.50లు చెల్లించేలా చూడాలని కోరారు. కమిషన్ వ్యాపారులు మిర్చి అమ్మకాలకు సంబంధించి రైతుల నుంచి రెండు శాతం మాత్రమే కమీషన్ తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రెండు శాతం మించి అదనంగా కమీషన్ వసూలు చేసే వ్యాపారులను కట్టడి చేయాలన్నారు. మిర్చి పంటకు తెగుళ్లు, అతివృష్టి, అనావృష్టి వల్ల దిగుబడులు భారీ స్థాయిలో తగ్గాయని, రైతులు నష్టపోకుండా వీలైనంత వరకూ మిర్చి ధరలు తగ్గకుండా చూడాలని కోరారు. స్పందించిన యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా రైతులకు నాణ్యమైన రుచికరమైన భోజనంతో పాటు ఉదయం పూట అల్పాహారం కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రైతు విశ్రాంతి భవన్‌లో అన్ని వసతులు ఏర్పాటు చేశామని వెల్లడించారు. ప్రస్తుతం యార్డుకు సీజన్ కావడంతో ప్రతిరోజు లక్షకు పైగా మిర్చి బస్తాలు వస్తున్నాయని, దీంతో స్వల్పంగా ధరలు తగ్గుముఖం పట్టాయని, ఏదిఏమైనా మిర్చి ధరలు తగ్గకుండా నిలకడగా ఉండే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. యార్డులో మెరుగైన వసతులు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన వివరించారు. యార్డును సందర్శించిన వారిలో ఏపీ రైతు సంఘం నాయకులు కొల్లి రంగారెడ్డి, ముసునూరు రమేష్‌బాబు, వెంకటేశ్వర రెడ్డి, యార్డు అధికారులు శ్రీకాంత్, సుబ్రమణ్యం తదితరులున్నారు.

జిల్లా పవర్ లిఫ్టింగ్ జట్టు ఎంపిక

మంగళగిరి: గుంటూరు జిల్లా సీనియర్ మెన్, ఉమెన్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ జట్టును ఎంపిక చేసినట్లు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.విజయ భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి ఎస్కే సంధానీలు తెలిపారు. సోమవారం నగరంలోని ఫిట్‌జోన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. పురుషుల విభాగంలో హెచ్ రమేష్ శర్మ (గుంటూరు), వై హర్షవర్ధన్ (తెనాలి), ఎల్ దినేష్ (గుంటూరు), ఎస్కే అష్రాఫ్ అలి (గుంటూరు), రామ్‌కుమార్ (మంగళగిరి), ఎస్ కౌశిక్ (తెనాలి), జి రాజాదత్తు (గుంటూరు), పి దేవేందర్‌రెడ్డి (తెనాలి), ఎం.అభిషేక్ (గుంటూరు)లను ఎంపిక చేసినట్లు తెలిపారు. మహిళల విభాగంలో ఎం షానున్ (తెనాలి), వి.రేవతి (తెనాలి), ఈఎల్ వినయ్‌శ్రీ (తెనాలి), ఎన్ నాగదివ్య (తెనాలి), బి.చంద్రిక (మంగళగిరి) ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన గుంటూరు జిల్లా సీనియర్ మెన్, ఉమెన్ పవర్ లిఫ్టింగ్ జట్టు ఏపీ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీన విశాఖ పట్టణంలో జరిగే ఏపీ సీనియర్ మెన్, ఉమెన్ పవర్ లిఫ్టింగ్ క్లాసిక్ ఎంపిక పోటీల్లో పాల్గొనున్నట్లు తెలిపారు. మెన్ టీం జట్టుకు కోచ్‌గా ఎస్కే సంధానీ, మేనేజర్‌గా గుమ్మడి వెంకటేశ్వరరావు, ఉమెన్ టీం కోచ్‌గా కొమ్మాకుల విజయభాస్కరరావు, మేనేజర్‌గా సాయి రేవతి వ్యవహరించనున్నట్లు పేర్కొన్నారు.




ఎంపికైన క్రీడాకారులతో విజయభాస్కరరావు, సంధానీ

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం



ప్రత్తిపాడు: ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా పోలీసు శాఖ పటిష్ట చర్యలు తీసుకుంటోందని ప్రత్తిపాడు సీఐ నిసార్ బాషా అన్నారు. మండలంలో సమస్యాత్మక గ్రామాలైన వంగిపురం, తిమ్మాపురం, గింజుపల్లివారిపాలెం, పాతమల్లాయపాలెం గ్రామాల్లో సోమవారం సీఐ నిసార్ బాషా, ఎస్ఐ సోమేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసు కవాతు నిర్వహించారు. ప్రధాన రహదారులతో పాటు అంతర్గత వీధుల్లో స్థానిక పోలీసులతో కలిసి సీఏపీఎఫ్, సీఐఎస్ఎఫ్ పోలీసు బలగాలు కవాతు చేశాయి. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గత ఎన్నికల దృష్ట్యా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పక్కా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలు, పార్టీల నాయకులు సహకరించాలని కోరారు.

చిత్రలేఖన ప్రదర్శనలో నగర విద్యార్థులకు పతకాలు



విద్యార్థులతో పాటిబండ్ల విష్ణువర్ధన్, కృష్ణవేణి, వరప్రసాదరావు

గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయస్థాయి చిత్రలేఖన ప్రదర్శన, వర్క్‌షాప్‌లో శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. లక్ష్మీపురం మెయిన్‌రోడ్డులోని పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డ్రీమ్‌వర్క్ ఆర్ట్ గ్యాలరీ, అనంత డైమండ్స్, కేఎల్ యూనివర్సిటీ సంయుక్తంగా డిసెంబర్ 20న నిర్వహించిన చిత్రలేఖన ప్రదర్శన, వర్క్‌షాప్‌లో 80 పాఠశాలలనుంచి 300మంది పాల్గొనగా, వారిలో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు 50 స్వర్ణ, 15 రజత పతకాలు సాధించినట్లు వివరించారు. 8వ తరగతి విద్యార్థి షేక్ నాగూర్ బాషా, 4వ తరగతి విద్యార్థిని ఏ. కీర్తన బెస్ట్ చిల్డ్రన్ అవార్డు కైవసం చేసుకున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఉత్తమ శిక్షణ ఇచ్చిన డ్రాయింగ్ టీచర్ హేమలతకు బెస్ట్ టీచర్ అవార్డుతో పాటు బెస్ట్ స్కూల్ అవార్డును అందుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మన్నవ శివశంకరరావు, పాఠశాల పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ప్రైమరీ ప్రిన్సిపాల్ కర్లపూడి పార్వతీదేవి పాల్గొన్నారు.



విద్యార్థులతో జనార్దనరెడ్డి, సుశీలారెడ్డి

డ్రీమ్‌వర్క్ ఆర్ట్‌గ్యాలరీ, అనంతడైమండ్స్, కేఎల్ యూ నివర్సిటీ సంయుక్తంగా నిర్వహించిన జాతీయ స్థాయి చిత్రలేఖన ప్రదర్శన, వర్క్‌షాప్‌లో జీకేఆర్ హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు ఆ పాఠశాల డైరెక్టర్ జి. జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఏటీ అగ్రహారంలో ని పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆ యన మాట్లాడుతూ పోటీల్లో తమవిద్యార్థులు నలుగు రు స్వర్ణ, మరో ఇద్దరు రజత పతకాలు గెలుపొందిన ట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ సుశీలారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రాణకోటి మనుగడకు జీవనాడులు వృక్షాలు



మొక్కలు నాటుతున్న అధ్యాపకులు, విద్యార్థినులు



మొక్కలు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, అధ్యాపకులు

గుంటూరు ఎడ్యుకేషన్: వృక్షాలు ప్రాణకోటి మనుగడకు జీవనాడులని ప్రభుత్వ మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం-4 ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ కె.వి జయకుమారి పేర్కొన్నారు. ప్రభుత్వ మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగ ఆధ్వర్యంలో లాలుపురంలో చేపట్టిన ప్రత్యేక శిబిరంలో భాగంగా సోమవారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా హెచ్ఎం సీహెచ్ పరిమళ మాట్లాడుతూ మొక్కలు నాటి, చెట్లను విరివిగా పెంచడం ద్వారా పచ్చదనం పెంపొందుతుందని తెలిపారు. ఈ సృష్టిలో ప్రతి జీవికీ ప్రాణవాయువును అందించే గొప్ప దాత వృక్షమని చెప్పారు. చెట్లను ఎక్కువగా పెంచడం ద్వారా మానవాళికి కాలుష్యం లేని స్వచ్ఛమైన గాలి, వాతావరణంలో చల్లదనం ఉంటుందని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

పచ్చదనపు ఆవశ్యకత చాటుతూ మొక్కల పంపిణీ

సంగడిగుంటలోని గుంటూరు చలమయ్య-కర్పూరపు వెంకట నారాయణ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం చేపట్టిన ప్రత్యేక సేవా శిబిరంలో భాగంగా సోమవారం పొన్నూరు రోడ్డులోని ఐపీడీ కాలనీ పరిసర ప్రాంతాల్లో పచ్చదనపు ఆవశ్యకత చాటుతూ స్థానికులకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు మాట్లాడుతూ వివిధ వేడుకల్లో అతిథులకు బహుమతులుగా మొక్కలను ఇవ్వడాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి జేవీ సుధీర్‌కుమార్ మాట్లాడుతూ ప్రపంచం మొత్తం కాలుష్యంతో నిండి ఉందని, క్రమంగా భూమి వేడెక్కుతోందని తెలిపారు. ఫలితంగా చర్మ సంబంధిత వ్యాధులు, ఆస్తమా, ఎలర్జీ, శ్వాస సంబంధమైన వ్యాధులు ప్రబలుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగ-1 అధికారి ఏ. శ్రీధర్ మొక్కల పెంపకంతో ఉపయోగాలపై ప్లకార్డులను ప్రదర్శించగా, ఎన్ఎస్ఎస్ రెండో విభాగ అధికారిణి శ్రీలక్ష్మి మొక్కల పెంపకంతో కలిగే ప్రయోజనాలపై గేయాన్ని ఆలపించారు. అనంతరం శ్రీసత్యసాయి మందిరం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఏ. చంద్రశేఖర్, మధుసూదన్, చైతన్య, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు చలపతి ఫార్మసీలో జాతీయ స్థాయి సదస్సు



సదస్సు బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రామారావు తదితరులు

గుంటూరు రూరల్: భారదేశ ఫార్మసీ పితామహుడు ప్రొఫెసర్ మహ దేవలాల్ ష్రాఫ్ జయంతి పురస్కరించుకుని చలపతి ఫార్మసీ కళాశాలలో ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా పిలుపు మేరకు ఈ నెల 6న ఫార్మా అన్వేషన్ 2024 జాతీయ స్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. సోమవారం నగర శివారులోని లాం నందున్న కళాశాలలో బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఫార్మా అన్వేషన్ కార్యక్రమంలో వివిధ పారిశ్రామికవేత్తలు, ఫార్మా నిపుణులు పాల్గొంటున్నారన్నారు. చెన్నైకి చెందిన సీఎల్ బైద్‌మేత్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రొఫెసర్ గురుప్రసాద్ మొహతా మాట్లాడుతూ భారతదేశంలో ఫార్మా విద్య, వృత్తి స్థితిని పెంచటం, నియంత్రించటం, ఏకరూప విద్య, శిక్షణ, ఉపాధి యోగ్యత, ఆరోగ్య సవాళ్లు, అభివృద్ధి, పరిశోధన, విద్యార్థుల నైపుణ్యాలు, జాతీయ విద్యా విధానం ప్రకారం ప్రస్తుత పాఠ్యాంశాల పునర్ నిర్మాణం తదితర అంశాలకు ఇది మంచి వేదిక కానుందన్నారు. విద్యార్థులంతాపాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.